# విప్లవం నుంచి విధిరాత వరకు: సామాన్యుడి నిరంతర పోరాటం

1947 ఆగస్టు 15. భారతదేశ చరిత్రలో ఒక కొత్త ఉదయం. దాదాపు రెండు శతాబ్దాల పరాయి పాలనకు ముగింపు పలికి భారతీయుడు తన భవిష్యత్తును తానే నిర్ణయించుకునే రోజు వచ్చింది. ఆ ఉదయం వెనుక మహాత్మా గాంధీ అహింస ఉంది. భగత్‌సింగ్ త్యాగం ఉంది. సుభాష్ చంద్రబోస్ సాహసం ఉంది. అల్లూరి సీతారామరాజు పోరాటం ఉంది. రాణి లక్ష్మీబాయి ధైర్యం ఉంది. సరోజినీ నాయుడు నాయకత్వం ఉంది. బాల గంగాధర్ తిలక్ గర్జన ఉంది. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వంటి వీరుల తిరుగుబాటు ఉంది. చరిత్రలో పేర్లు నిలిచినవారితో పాటు పేర్లు తెలియని లక్షలాది మంది సామాన్యుల త్యాగం ఉంది.

ఆగస్టు 15న జాతీయ జెండా ఎగురుతుంది. పాఠశాలల్లో దేశభక్తి గీతాలు వినిపిస్తాయి. ప్రభుత్వ కార్యాలయాలు అలంకరించబడతాయి. నాయకులు ప్రసంగిస్తారు. ఇవన్నీ అవసరమే. కానీ ఒకసారి మనం వేడుకల సందడిని పక్కనపెట్టి సామాన్యుడి ఇంటి తలుపు తట్టాలి. అక్కడ ఏమి కనిపిస్తోంది? పిల్లల చదువు కోసం తండ్రి పడుతున్న ఆందోళన కనిపిస్తుందా? వైద్య ఖర్చు కోసం తల్లి దాచుకున్న పొదుపు కనిపిస్తుందా? ఉద్యోగం కోసం పరీక్షల మీద పరీక్షలు రాస్తున్న యువకుడు కనిపిస్తున్నాడా? పంటకు సరైన ధర కోసం ఎదురుచూస్తున్న రైతు కనిపిస్తున్నాడా? నెల జీతం వచ్చిన వారం రోజులకే ఖర్చుల లెక్కలు వేసుకుంటున్న మధ్యతరగతి కుటుంబం కనిపిస్తుందా? జెండా ఆకాశంలో ఎగురుతోంది. మరి ఆ జెండా కింద జీవిస్తున్న మనిషి జీవితం కూడా అదే స్థాయిలో పైకి ఎగిరిందా?

నేటి ప్రభుత్వాలు తమ విజయాలను గణాంకాలతో వివరిస్తున్నాయి. జిడిపి పెరిగింది, రహదారులు పెరిగాయి, డిజిటల్ లావాదేవీలు పెరిగాయి, పెట్టుబడులు వచ్చాయి, మౌలిక వసతులు విస్తరించాయి అని చెబుతున్నాయి. ఇవన్నీ ముఖ్యమైనవే. కానీ ఒక ప్రభుత్వ పాలనకు అసలు పరీక్ష గణాంకాల పట్టికలో కాదు -- ప్రజల జీవితాల్లో ఉంటుంది. ఒక కుటుంబం నెలాఖరులో ప్రశాంతంగా ఉంటే, ఒక యువకుడు తన భవిష్యత్తుపై నమ్మకంతో ఉంటే, ఒక రైతు పంట అమ్మిన తర్వాత సంతృప్తిగా ఇంటికి వెళ్తే, ఒక పేద కుటుంబం అనారోగ్యం వచ్చినా అప్పులపాలు కాకుండా చికిత్స పొందగలిగితే -- అప్పుడే పాలన ప్రజల జీవితాల్లో కనిపించిందని చెప్పాలి.

1947లో భారతదేశం ఎదుర్కొన్న సమస్యలు నేటి కంటే ఎన్నో రెట్లు తీవ్రమైనవి. పరిశ్రమలు తక్కువ. అక్షరాస్యత తక్కువ. ఆహార కొరత తీవ్రంగా ఉంది. మౌలిక వసతులు బలహీనంగా ఉన్నాయి. దేశ విభజన గాయాలు ఇంకా మానలేదు. అయినా ఆ తరం వెనుకడుగు వేయలేదు. ఎందుకంటే వారికి ఒక నమ్మకం ఉంది -- స్వతంత్ర భారతదేశంలో తమ పిల్లల భవిష్యత్తు మెరుగ్గా ఉంటుందని. నేడు మనకు అంతరిక్ష విజ్ఞానం ఉంది. అణుశక్తి ఉంది. ప్రపంచ స్థాయి సాంకేతిక నైపుణ్యం ఉంది. డిజిటల్ విప్లవం ఉంది. ప్రపంచవ్యాప్తంగా భారతీయుల ప్రతిభకు గుర్తింపు ఉంది. కానీ ఆ అభివృద్ధి సామాన్యుడి కుటుంబ బడ్జెట్‌లో ఎంత కనిపిస్తోంది? దేశం ఆర్థికంగా పెద్దదవుతున్న కొద్దీ సాధారణ కుటుంబం ఆర్థికంగా భద్రంగా మారుతోందా?

నేటి మధ్యతరగతి పరిస్థితిని ఒక్కసారి పరిశీలిస్తే ఈ ప్రశ్న మరింత బలంగా వినిపిస్తుంది. జీతం వస్తుంది. ఆదాయపన్ను చెల్లించాలి. వస్తువులు కొనుగోలు చేస్తే పన్నులు చెల్లించాలి. ఇంటి అద్దె లేదా ఈ.ఎం.ఐ ఉంటుంది. పిల్లల పాఠశాల ఫీజు ఉంటుంది. విద్యుత్ బిల్లు ఉంటుంది. ఇంధనం, రవాణా, ఇంటి సరుకులు, వైద్యం, బీమా, మొబైల్, ఇంటర్నెట్, తల్లిదండ్రుల బాధ్యత -- అన్నీ ఒకేసారి ఉంటాయి. పిల్లల భవిష్యత్తు కోసం పొదుపు చేయాలి. చివరికి, జీతం పెరిగినంత వేగంగా కుటుంబం చేతిలో మిగిలే డబ్బు పెరుగుతోందా?



ఇక్కడే కేంద్ర ప్రభుత్వాన్ని ఒక సామాన్య పౌరుడు నేరుగా ప్రశ్నించాల్సిన అవసరం వస్తుంది. పన్నులు వసూలు చేయడానికి ఆధునిక సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. పన్ను ఎగవేతను గుర్తించడానికి డేటా విశ్లేషణ చేస్తున్నారు. +ూ వ్యవస్థను డిజిటలైజ్ చేస్తున్నారు. ప్రతి లావాదేవీని గుర్తించే సామర్థ్యం పెంచుతున్నారు. ఇది పరిపాలనా సామర్థ్యానికి సూచన. కానీ పన్ను చెల్లించే కుటుంబం ఎదుర్కొంటున్న విద్యా ఖర్చు, వైద్య ఖర్చు, ఇంటి అద్దె, రవాణా ఖర్చు, పిల్లల భవిష్యత్తు ఖర్చును గుర్తించడానికి కూడా అదే స్థాయి డేటా ఆధారిత విధానం ఎందుకు ఉండకూడదు? పన్ను వసూలు వ్యవస్థ ఎంత ఆధునికంగా మారుతుందో, ప్రజల జీవన వ్యయం తగ్గించే వ్యవస్థ కూడా అంతే ఆధునికంగా మారాలి కదా?

మహాత్మా గాంధీ ఉప్పు సత్యాగ్రహం ద్వారా ఒక సామాన్యుడి జీవితాన్ని తాకే ఆర్థిక భారాన్ని జాతీయ ఉద్యమానికి కేంద్రంగా మార్చారు. నేడు మనకు ప్రజాస్వామ్య ప్రభుత్వం ఉంది. దేశాన్ని నడపడానికి పన్నులు అవసరం. రక్షణ, విద్య, వైద్యం, రహదారులు, సంక్షేమం, పరిపాలన -- అన్నింటికీ ప్రభుత్వ ఆదాయం అవసరం. కాబట్టి పన్ను చెల్లించడం పౌరుడి బాధ్యత. కానీ పన్ను చెల్లించే పౌరుడి జీవితం సులభం చేయడం ప్రభుత్వ బాధ్యత కాదా?

భారతదేశంలో విద్యారంగం విస్తరించింది. కొత్త విశ్వవిద్యాలయాలు, సాంకేతిక సంస్థలు, ఆన్‌లైన్ విద్య, డిజిటల్ వనరులు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు పెరిగాయి. కానీ ఒక సాధారణ తల్లిదండ్రి ప్రశ్న మాత్రం చాలా సూటిగా ఉంటుంది: "నా పిల్లవాడికి మంచి విద్య అందించడానికి నేను ఎంత ఖర్చు చేయాలి?" పాఠశాల ఫీజు నుంచి ఉన్నత విద్య వరకు ఖర్చు పెరుగుతోంది. విద్య భవిష్యత్తుకు తలుపు కావాలి; ఆ తలుపు ముందు డబ్బు గోడగా నిలవకూడదు.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ "విద్యను అభ్యసించండి, ఆందోళన చేయండి, సంఘటితం అవ్వండి" అని పిలుపునిచ్చారు. నేటి తరం కోసం ఈ సందేశం మరింత ప్రాసంగికం. చదువుకున్న యువత ప్రశ్నించకపోతే ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే స్వరం ఎక్కడి నుంచి వస్తుంది?

భగత్‌సింగ్ మాటలు ఈ సందర్భంలో మరింత పదునుగా వినిపిస్తాయి. "విప్లవం మానవజాతి యొక్క విడదీయరాని హక్కు; స్వేచ్ఛ ప్రతి మనిషి చెరగని జన్మహక్కు." నేడు విప్లవం అంటే ఆయుధం కాదు. ఆలోచన. ప్రశ్న. చైతన్యం. ఓటు. బాధ్యత. ప్రభుత్వ విధానం ప్రజలకు నష్టం చేస్తే ప్రశ్నించడం.

సుభాష్ చంద్రబోస్ పేరు భారత స్వాతంత్ర్య పోరాటంలో అచంచల ధైర్యానికి ప్రతీక. ఆనాడు దేశం రక్తాన్ని అడిగితే --- నేడు దేశం నిజాయితీని అడుగుతోంది. ఓటును అమ్ముకోకుండా ఉండమంటోంది. పన్ను ఎగవేయకుండా ఉండమంటోంది. ప్రజా ఆస్తిని ధ్వంసం చేయవద్దంటోంది. అవినీతికి సహకరించవద్దంటోంది. ఒక తరం స్వాతంత్ర్యం కోసం రక్తం ఇచ్చింది; మన తరం స్వాతంత్ర్యాన్ని నిలబెట్టేందుకు నిజాయితీ ఇవ్వలేమా?

అల్లూరి సీతారామరాజు పేరు వస్తే పోరాటం, ధైర్యం, తిరుగుబాటు గుర్తుకొస్తాయి. ఆయన జీవితం మనకు ఒక గొప్ప సందేశాన్ని ఇస్తుంది -- అన్యాయాన్ని సహించి మౌనంగా ఉండటం విధి కాదు. నేడు మనం ఆయుధాలతో పోరాడాల్సిన అవసరం లేదు. మన రాజ్యాంగం మనకు ప్రశ్నించే హక్కు, ఓటు హక్కు, భావప్రకటనకు హక్కు ఇచ్చింది.

స్వాతంత్ర్య ఉద్యమంలో మహిళల పాత్రను కూడా మరచిపోలేం. నేడు భారత మహిళలు ప్రతి రంగంలోనూ ముందుకు వస్తున్నారు. అయితే, ఒక మహిళ రాత్రి ఒంటరిగా ఇంటికి వస్తున్నప్పుడు భయపడాల్సి వస్తే, కార్యాలయంలో సమాన అవకాశాల కోసం ఇంకా పోరాడాల్సి వస్తే, కుటుంబ ఆర్థిక నిర్ణయాల్లో ఆమె గొంతు బలహీనంగా ఉంటే -- ఆమెకు వచ్చిన స్వేచ్ఛను పూర్తిగా సాధించినట్లేనా?

రైతు విషయానికి వస్తే, దేశ ఆర్థిక వ్యవస్థ ఎంత ఆధునికమైనా నేలతో ఉన్న సంబంధాన్ని మరచిపోలేం. రైతు పండించే పంటకు ధర నిర్ణయించే సమయంలో అతని గొంతు ఎంత బలంగా ఉంది? రైతు ఆదాయం స్థిరపడాలి. రైతును గౌరవించడం అంటే అతని ఆదాయాన్ని గౌరవించడం. ఆరోగ్య రంగంలో కూడా ఇదే పరిస్థితి. దేశంలో ప్రపంచ స్థాయి ఆసుపత్రులు ఉన్నాయి. అత్యాధునిక వైద్యం అందుబాటులో ఉంది. అయినప్పటికీ, ఒక సాధారణ కుటుంబంలో పెద్ద వ్యాధి వస్తే మొదటి భయం ఇంకా డబ్బే. కుటుంబం ఆరోగ్య సమస్యను ఎదుర్కొన్నప్పుడు పొదుపు మొత్తం కరిగిపోకుండా ఉండే ఆరోగ్య వ్యవస్థను నిర్మించగలమా?

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం మారుతుంది. పార్టీలు మారుతాయి. నాయకులు మారుతారు. కానీ ప్రజల సమస్యలు మాత్రం పార్టీ జెండాలు చూసి మారవు. ధరల పెరుగుదల, నిరుద్యోగం, అనారోగ్యం, రైతు పంటకు ఏ పార్టీ గుర్తు ఉండదు. అందుకే ప్రజా సమస్యలను పార్టీ అద్దంలో కాకుండా, ప్రజల జీవితాల అద్దంలో చూడాల్సిన సమయం ఇది.

ముగింపులో, స్వాతంత్ర్యం అంటే కేవలం 1947లో బ్రిటిష్ పాలన ముగియడం కాదు. ఆకలి, నిరక్షరాస్యత, భయం, అన్యాయం, అవకాశాల కొరత, పేదరికం నుంచి విముక్తి పొందడమే. ఆగస్టు 15న జెండాకు సెల్యూట్ చేద్దాం. స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుందాం. దేశ విజయాలను గర్వంగా చెప్పుకుందాం. అదే సమయంలో ప్రభుత్వాన్ని ప్రశ్నిద్దాం. మనల్ని మనం కూడా ప్రశ్నించుకుందాం. దేశభక్తి అంటే కేవలం దేశాన్ని పొగడటం కాదు; దేశం ఇంకా మెరుగ్గా ఉండాలని కోరుకోవడం. జెండా ఆకాశంలో ఎగురుతోంది. ఇక సామాన్యుడి జీవితం కూడా అంతే ఎత్తుకు ఎగిరినప్పుడే మన స్వాతంత్ర్యం సంపూర్ణమవుతుంది.



సంపూర్ణమవుతుంది.

సామాజిక విశ్లేషకులు, గంగుల రాజి రెడ్డి
99083 51557